
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 నవంబర్ 2022
5
తిరుపతి



4న శ్రీవారి దర్శనానికి రాష్ట్రపతి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రపతిగా ఎన్నికైన ద్రౌపది ముర్ము డిసెంబర్ 4న తిరుమల శ్రీవారి దర్శనం నిమిత్తం రానున్నారు. అదేరోజు రాత్రి తిరుమల పద్మావతి అతిథిగృహంలో బస చేసి 5న ఉదయం శ్రీవారిని, అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నట్లు సమాచారం.

సక్సెస్ @ మమత

రిజిస్ట్రార్‌గా ఆరేళ్లు పూర్తి
మహిళా వర్సిటీలో 'అరుదైన' ముద్ర
కుటుంబ సహకారం 'కొండంత'

ప్రజాశక్తి - క్యాంపస్

సక్సెస్‌కు చిరునామా.. మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డిఎం మమత.. బోధన, పరిశోధన, పరిపాలనా రంగాలలో మేటిగా నిలిచారు.. తనదైన శైలితో రాణిస్తూ మహిళాభ్యుదయ పరిపాలనకు తనవంతు కృషి చేశారు. రిజిస్ట్రార్‌గా ఆరేళ్లు పూర్తి చేసుకున్న ఆమె నూతన ఒరవడులతో ఇటు ఉద్యోగులు, అటు విద్యార్థుల సమస్యలను సున్నితంగా పరిష్కరిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

2016 నవంబర్ 26న మహిళా వర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య మమత వర్సిటీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డివిస్టీ - టెక్నాలజీ బిజినెస్ ఇంకుబేటర్, డిబిటి - బయోనెస్ట్ బయోటెక్ ఇంకుబేటర్, ఖేలో ఇండియా స్పోర్ట్స్ మల్టీ పర్పస్ హాల్, లివ్లీహుడ్ ఇంకుబేటర్ వంటి సెంట్రల్ ఫెసిలిటీస్ ఏర్పాటుకు అవసరమైన రూ. 66 కోట్ల నిధులను సాధించడంలో సఫలీకతులయ్యారు. అంతేకాకుండా ఇ- ఆఫీస్, పేమెంట్ గేట్వే సిస్టం, ఆఫీస్ ఆటోమేషన్, బ్లెండెడ్ మోడ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వంటి పరిపాలనా పరమైన మార్పులకు నాంది పలికారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 రిఫార్మ్స్ అమలు చేయడంలో కీలక భూమిక పోషించారు. బోధన, బోధనేతర సిబ్బంది సమస్యల పరిష్కారంలో ఆచార్య మమత కీలక భూమిక పోషించి అందరి మన్ననలు పొందారు. పలు కీలకమైన కమిటీలలో మెంబర్ గా స్థానం సాధించిన ఆచార్య మమత మహిళా వర్సిటీకి గతంలో నాక్ ఏ గ్రేడ్ రావడంలోనూ కీలకంగా వ్యవహరించారు. పలు విశ్వవిద్యాలయాల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్, బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్ గా ఉన్నారు. 23 సంవత్సరాల



బోధనానుభవం కలిగిన ఆచార్య మమత ఫుల్ బ్రైట్ స్కాలర్, ఉత్తమ పరిశోధకురాలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ పలు పరిశోధన పత్రాలను, పుస్తకాలను ప్రచురించారు. పేటెంట్స్ కూడా పొందారు. 20కి పైగా సదస్సులు, అకడమిక్ ప్రోగ్రాములను నిర్వహించడమే కాకుండా 200 లకు పైగా సదస్సులలో పాల్గొని పరిశోధనా ఫలితాలపై ప్రసంగించారు. అకడమిక్, పరిశోధనా పరమైన కార్యక్రమాలపై మలేషియా, సింగపూర్, బ్యాంకాక్, థాయిలాండ్, యూఎస్ఏ, లండన్, కెనెడా, ఖాట్మండు,



ఈజిప్ట్, కాలిఫోర్నియా వంటి దేశాలను సందర్శించారు. 2006లో డబ్ల్యూహెచ్ఓ అచీవ్మెంట్ అవార్డు, 2007లో డిబిటి యంగ్ సైంటిస్ట్ అవార్డు, 2008లో లైఫ్ టైమ్ అవార్డు, 2009, 2010లో ఐఎన్ఎస్ఏ - నేషనల్ అకాడమీస్ సమ్మర్ రీసెర్చ్ ఫ్యాకల్టీ అవార్డు, 2013లో బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డు, 2014లో యూఎస్ - ఫుల్ బ్రైట్ ఫెలోషిప్, 2016లో రీసెర్చ్ ఎక్సలెన్సీ అవార్డు, 2017 లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నుంచి బెస్ట్ టీచర్ అవార్డులను సొంతం చేసుకున్నారు.

పరిశోధనా రంగానికే ప్రథమ ప్రాధాన్యత: రిజిస్ట్రార్ ఆచార్య మమత

మహిళా విశ్వవిద్యాలయంలో పరిశోధనా రంగానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య మమత వెల్లడించారు. రిజిస్ట్రార్ గా ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. తన కుటుంబ అండ కొండంతని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉపకులపతి అభినందనలు

మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ గా ఆచార్య మమత ఆరు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున, లీగల్ ఆఫీసర్ దేవిరెడ్డి భాస్కర రెడ్డి, అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు. కరోనా క్లిష్ట పరిస్థితులలో కూడా వర్సిటీలో పలు అభివద్ధి కార్యక్రమాల్లో ఆచార్య మమత అందించిన సహకారాన్ని కొనియాడారు.

పని కల్పించాలి.. భూమి పంచాలి..!

వ్యకాసం జిల్లా మహాసభల్లో దడాల



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/బుచ్చినాయుడు కండ్రిగ

చేతిలో పనీ, వేళకు తిండి లేక బక్క చిక్కిపోతున్న వ్యవసాయ కార్మికులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికీ 200 రోజుల ఉపాధి పనినీ, 2 ఎకరాల భూమిని పంచాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం తిరుపతి జిల్లా ప్రప్రథమ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దడాల సుబ్బారావు హాజరయ్యారు. ముందుగా సభా ప్రాంగణం వద్ద వ్య.కా.సం జెండాను ఆవిష్కరించారు. కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య, తెలంగాణా వీరవనిత మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం ఆ సభా ప్రాంగణానికి తెలంగాణా పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం పేరు పెట్టారు. ఈ మూడేళ్ల కాలంలో మరణించిన ఉద్యమకారులకు నివాళులర్పించారు.

మహాసభలనుద్దేశించి దడాల సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ కార్మిక రంగం అంపశయ్యపై ఉందని వాపోయారు. వ్యవసాయ కూలీలు కాస్తా వలస కూలీలుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నానాటికి వ్యవసాయ కూలీల సంఖ్య పెరుగుతున్నా వ్యవసాయ పనులు చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోవడమే ఇందుకు తార్కాణమని ఉదహరించారు. 1994 కాలంలో ప్రతి వ్యవసాయ కార్మికుడికి 200 రోజుల పనిదినాలుండేవనీ, 2012 నాటికి 100 రోజులు, ప్రస్తుతం కనీసం 30 రోజులైనా పనులు దొరకడం లేదని వాపోయారు. వ్యవసాయం రంగంలో యాంత్రికరణ పద్ధతులు అవలంభించడం, కార్పొరేట్లకు మేలు చేకూర్చేలా రాయితీలపై వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వాలు కొనుగోలు చేయడమే వ్యవసాయ కార్మిక రంగంలో సంక్షోభానికి ప్రధాన కారణమని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్షాల పోరాట ఫలితంతో పురుడు పోసుకున్న 2005 ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల జాబ్ కార్డులు ఉన్నాయనీ, రూ.2.5 లక్షల కోట్ల నిధులు ఉపాధి పనులకు కేటాయించాల్సి ఉందనీ, అయితే మోడీ ప్రభుత్వం రూ.75 వేల కోట్లు మాత్రమే విదిల్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో 2 కోట్లకు పైగా 22 రకాల మిగులు భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయనీ, వాటన్నింటినీ పేదలకు పంచితేనే దేశంలో పేదరికం ఆర్థిక అసమానతలు తగ్గుతాయని వివరించారు. భూస్వాముల చేతుల్లో బంధీగా ఉన్న మిగులు భూములన్నింటినీ పోరాటాల ద్వారా సాధించుకోకుంటే వ్యవసాయ కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందనీ, వ్యవసాయ కార్మికుల పోరాటాలకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కాలంలో దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారనీ, వారికి గోదాముల్లో దాచిన 8 కోట్ల టన్నుల తిండి గింజలను 50 కిలోలు చొప్పున మూడు నెలల పాటు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తే మోడీ పట్టించుకోలేదని వాపోయారు.

భతిగా నెలకు రూ.5 వేలు డిమాండ్ ను పక్కన పెట్టేసాడని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వ్యవసాయ కార్మికరంగాన్ని ఆదుకోవాలంటే 200 రోజులు ఉపాధి పని దినాలు, రూ.650 రోజువారి కూలీ కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు ఎకరాల భూమిని పంచాలని కోరారు. లేకుంటే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, రాష్ట్ర కార్యదర్శి వందవాసి నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, సంఘం నాయకులు బాలకష్ణ, గురవమ్మ, ముత్యాలయ్య, అముద, రాజగోపాలయ్య, బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కురులే 'సిరులు'

ఆర్నెళ్లలో రూ.48 కోట్ల ఆదాయం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'శ్రీవారికి' భక్తులు సమర్పించే కానుకలే కాకుండా.. కురులు సైతం సిరులు కురిపిస్తున్నాయి.. హుండీ తరువాత అంతటి ఆదాయం కల్యాణకట్ట ద్వారా వస్తుందంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ప్రతిరోజూ శ్రీవారి దర్శనానికి 60-70 వేలపైన వస్తుంటే వీరిలో సగం మంది ఖచ్చితంగా మొక్కు తీర్చుకుంటూ ఉంటారు. శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైనది తలనీలాలని, మొక్కు తీర్చుకుంటే కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల నమ్మకం. అందుకే ఏ కష్టమొచ్చినా 'గుండు' కొట్టించుకుంటామని మొక్కుకుంటూ ఉంటారు. తిరుమలలో భక్తులు సమర్పించిన తలనీలాల ద్వారా ఈసారి స్వామివారికి భారీగా ఆదాయం వచ్చింది.

గత ఆర్నెళ్లుగా 'ఈ'వేలం వేయగా 21,100 కిలోలు అమ్మడి ద్వారా రూ.47.92 కోట్ల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి వచ్చింది. 19-27 ఇంచుల పొడవైన వెంట్రుకలను 'ఎ'గ్రేడ్‌గా భావిస్తారు. 19-27, 18-10, 5-9, 5 ఇంచుల వెంట్రుకలను 20 కేజీల కవర్లలో, మిగిలినది 30 కేజీల కవర్లలో వేసి హరేరామ హరేకృష్ణ రోడ్డులోని టిటిడి గోడౌన్ ఉంచుతారు. రోజుకు తిరుమల నుంచి 700 నుంచి 900 కిలోల వరకు ఈ గోడౌన్‌కు చేరుకుంటాయి. ఆర్నెళ్లకోసారి ఈ వేలం ద్వారా స్వదేశీ, విదేశీ వ్యాపారులతో 'ఈ'వేలం వేస్తారు. ముఖ్యంగా ఈ వెంట్రుకలను విగ్గులకు ఉపయోగిస్తారు.

ఎపుడూ లేనంత ఆదాయం : టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి

కరోనా కాలంలో ఇంత ఆదాయం 'ఈ' వేలం ద్వారా ఇంత ఆదాయం రాలేదు. కరోనా నిబంధనల నుంచి బయట పడడంతో ఈ ఆర్నెళ్లకాలంలో భక్తులు విశేషంగా తిరుమలకు వచ్చారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మొక్కుబడులను ఒక్కసారిగా వచ్చి తీర్చుకున్నారు. మహిళల తలనీలాలే ఎక్కువగా ఉన్నాయన్నది అంచనా. ఎపుడూ లేనంతగా ఆర్నెళ్ల కాలంలో శ్రీవారికి రూ.48 కోట్లు రావడం ఆనందదాయకంగా ఉంది.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి : సిఐటియు



తిరుపతి టౌన్ : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి పథకాలు అందేలా చూడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల తిరుపతి ఏడో మహాసభ సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగింది. జెండా ఆవిష్కరణ అనంతరం బహిరంగసభలో ఎసిఎల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని, గుర్తింపు కార్డు ఉంటే కనీస సౌకర్యాలు అమలవుతాయన్నారు. కందరాపు మురళి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఇటీవల కాలంలో పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, సంక్షేమ బోర్డు నుంచి యధావిధిగా పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేయాలని, ఇసుక మాఫియాను అరికట్టి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికయ్యింది. అధ్యక్షులుగా పి.సుందరం, నగర ప్రధాన కార్యదర్శిగా పి.చిన్నాను, కోశాధికారిగా జి.వెంకట సుబ్బయ్యను, సహాయ కార్యదర్శులుగా నారాయణస్వామి, రమణ, దాసు, రత్నం, ఉపాధ్యక్షులుగా బి.శ్రీరాములు, బాబు, జనార్ధన్, పద్మనాభం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మి, అధ్యక్షులు టి.సుబ్రమణ్యం, నాయకులు కె.వేణుగోపాల్, తంజావూరు మురళి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తిరుపతి సిటి: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్, మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నారాయణాద్రి హాస్పిటల్ వారి సహకారంతో తిరుపతి లోని లీలా మహల్ దగ్గర ప్రకాశం మునిసిపల్ పార్క్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అందరి సహకారంతో ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయినట్లు నారాయణాద్రి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునంద కుమార్ రెడ్డి, లయన్స్ క్లబ్ సెవెన్ హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్, పార్క్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి తెలిపారు. దాదాపు 350 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి జగన్నాధం, కోశాధికారి విష్ణు ప్రసాద్, బెల్లం కొండ సురేష్, కోలా లక్ష్మీపతి పాల్గొన్నారు.

బి.సి మండల్ విగ్రహావిష్కరణ హర్షణీయం

తిరుపతి టౌన్ తిరుపతి పట్టణం వైఎస్సార్ మార్గ్ లోని డీబీఆర్ హాస్పిటల్ కూడలిలో బిసి మండల్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, నగర మేయర్ శిరీష, ఎంపి గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి నేటికి 75 సంవత్సరాలు పూర్తయినా బిసిలకు సరైన న్యాయం జరగలేదన్నారు. నాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలోనూ, నేటి జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే బిసిలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీల అభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. బిసిలకు రాజకీయ పదవుల్లో పెద్దపీట వేస్తూ డాక్టర్ శిరీషను నగర తొలి మేయర్‌గా ఎన్నికయ్యేలా చేశారన్నారు.

బ్యాంకు ఉద్యోగుల అన్నదానం

తిరుపతి టౌన్: నగర బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటి ఆధ్వర్యంలో కపిలతీర్థం వద్ద ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిబిఇసిసి ప్రధాన కార్యదర్శి ధన్వంత్‌కుమార్, అధ్యక్షులు విజయభాస్కర్ మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు సామాజిక సేవలో చురుకైన పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు భాస్కర్, జనార్ధన్, సుమం రేష్మ, నందగోపాల్, మహేష్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై చర్చించండి

టిటిడి ఛైర్మన్‌కు సిఐటియు లేఖ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సమావేశం ఈనెల 30వ తేదీన జరగనున్న నేపథ్యంలో కార్మికుల సమస్యలపై చర్చించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి లేఖ రాశారు. రెండేళ్లుగా న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అటవీ కార్మికులు సాగిస్తున్న పోరాటాన్ని విస్మరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్ గా పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత పలు సందర్భాల్లో వైవి సుబ్బారెడ్డి కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వయంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టర్ల దోపిడీకి ధార్మిక క్షేత్రం టీటీడీలో కార్మికులు బలైపోతున్న విషయాన్ని టిటిడి బోర్డు గుర్తించాలని కోరారు. టీటీడీలోని 16 వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు, 7 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు తీవ్రమైన అసంతప్తితో ఉన్న విషయాన్ని గమనించాలని కోరారు. కార్మిక సంఘాలతో కనీస చర్చలు జరపకపోవడం, వారి పోరాటాలను నిర్లక్ష్యం చేయటం కారణంగా తగిన మూల్యం చెల్లించుకునే పరిస్థితి ఏర్పడిందని దీన్ని టీటీడీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం గమనించాలని కోరారు.

ఆరనీకుమా... ఈ దీపం



'కల్తీ నూనెతో 'కక్కుర్తి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'శతకోటి దరిద్రాలకు..అనంత కోటి ఉపాయాలు' అన్న చందాన తయారయ్యింది శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద నేతి దీపాలు విక్రయిస్తున్న కొందరు వ్యాపారుల పరిస్థితి. ఒకపక్క ఆలయ అధికారులు భక్తులకు కల్తీ నేతి దీపాలు విక్రయించకుండా చర్యలు చేపడుతుంటే అక్రమార్కులు మరో మార్గంలో అక్రమాలకు తెరదీస్తున్నారు.. భక్తులను నిలువునా మోసం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. వివరాల్లోకి పోతే.. శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో చాలా మంది వ్యాపారులు కల్తీ నేతి దీపాలు విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై కొందరు భక్తులు ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు దష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన కల్తీ నేతి దీపాలపై ప్రత్యేక దష్టి సారించారు. కల్తీ నేతి దీపాలు విక్రయించకుండా కొద్ది రోజులు ఆంక్షలు విధించారు. అయితే ఆయనపై కొందరు వ్యాపారులు రాజకీయ ఒత్తిళ్లు తేవడంతో మళ్లీ నేతి దీపాలు విక్రయించుకోవడానికి అనుమతి ఇవ్వాల్సి వచ్చింది. అయితే అసలైన నేతి దీపాలు మాత్రమే విక్రయించాలనే నిబంధన విధించారు. ఇందుకు వ్యాపారులు కూడా అంగీకరించారు. ఇలా కొన్ని రోజుల పాటు ఈ నిబంధన పాటించారు. ఇందుకు అందరూ సంతోషించారు. అయితే కార్తీకమాసం ఆరంభమైనప్పటి నుంచి వ్యాపారులు మళ్లీ అడ్డదారులు తొక్కుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇందులో శ్రీకాళహస్తి పట్టణం సూపర్ బజారు కూడలి సమీపంలో ఉండే ఓ వ్యాపారి కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈయన నెయ్యికి బదులు వేరే నూనెను నేతి దీపాల వ్యాపారులకు విక్రయిస్తున్నాడని సమాచారం. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం 50 గ్రాముల నెయ్యి రూ.45లు పలుకుతోంది. అయితే ఈయన నెయ్యి పేరుతో 50 గ్రాములు నూనెను రూ.6.50కే వ్యాపారులకు ఇస్తున్నాడని చెప్పుకుంటున్నారు. ఇలా 20 సీసాలను రూ.130కి వ్యాపారులకు ఇస్తున్నాడు. అదే అసలు నెయ్యి అయితే 20 సీసాలకు రూ.900లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కారణంగా నేతి దీపాల వ్యాపారులు అసలు నేతికి బదులు ఈ నూనెను కొనుగోలు చేసి భక్తులకు నేతి ధరకే అంటగడుతున్నారు. ఇది అసలైన నెయ్యి అని చెబుతున్నారు. ఒక్కో దీపం రూ.100 వంతున భక్తులకు విక్రయిస్తున్నారు. ఈ దీపం రూ.50లు కూడా ఉండదు. అయినా రెట్టింపు ధరకు భక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకూ తెలుసు. అయినా ఎందుకో చర్యలు తీసుకోవడం లేదు. ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఇకనైనా స్పందించి నేతి దీపాల పేరుతో జరుగుతున్న అక్రమాలను అరికట్టాల్సి అవసరం ఎంతైనా ఉంది. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వరవ కాల్వల ఆక్రమణతో...

'గడప గడపకూ' రొచ్చే..!

బస్టాండ్ పరిసరాలు బురదమయం

ప్రజాశక్తి - బాలాయపల్లి

తరాలు మారినా యుగాలు మారినా గిరిజనుల జీవితాల్లో మార్పు లేదు.. బాలాయపల్లి మండల కేంద్రంలోని వరవ కాల్వలను పెత్తందారులు ఆక్రమించుకోవడంతో వర్షం పడిన ప్రతిసారీ గిరిజన గూడేలన్నీ నీళ్లతో నిండిపోతాయి. అంతేకాదు ముంపు వాన కురిసిందంటే వర్షపు నీరంతా ఇళ్లలోకే వచ్చి చేరుతుంది. బురదమయమై దుర్గంధంతో దోమలు స్వైర విహారం చేస్తుంటాయి. ఏదైనా పనుండి ఇంట్లోనుంచి కాలు బయట పెట్టాలంటే 'అడుసు' తొక్కాల్సిందే. గిరిజనులు ఇంత అవస్థలు పడుతున్నా పాలకులు ఓట్లకు తప్ప మా బాధలు వినడానికి ఎవరూ రారని, కనీసం 'గడప గడపకూ మన ప్రభుత్వ' కార్యక్రమంలో గిరిజన గూడేల్లో కాలు పెట్టిన నాథుడు లేడని వారు వాపోతున్నారు.

బాలాయపల్లి మండల కేంద్రంలోని గిరిజనవాడ ప్రజలు 30 ఏళ్లుగా అక్కడే జీవనం సాగిస్తున్నారు. అయితే అసౌకర్యాల నడుమే వీరి జీవనం ఉంటుంది. వర్షం పడితే కాలు బయట పెట్టే పరిస్థితి ఉండదు. సిసి రోడ్లు నిర్మించారు. అయితే మురుగు కాల్వల నిర్మాణం లేదు. మంచినీటి సరఫరా అంతంత మాత్రమే. అంతర్గత రహదారులన్నీ ప్రారంభం నుంచి మట్టి రోడ్లుగా ఎలా ఉన్నాయో దశాబ్దకాలం దాటినా అప్పటి పరిస్థితే ఇప్పటికీ కొనసాగుతోంది. వరవ కాల్వల ఆక్రమణలతో ఇళ్లల్లోకి నీరొస్తుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, రాత్రిపూట విషపురుగులు వస్తుంటాయని వారు వాపోతున్నారు. సంక్షేమ పథకాలేవీ వీరికి అందని పరిస్థితి. వాలంటీర్లు రారు. అధికారులు రారు.. పాలకులు రారు. దళితవాడలోనూ ఇదే పరిస్థితి. ప్రధాన రహదారిని 2007లో సిసి రోడ్డు వేశారు. అదికాస్త బురద పేరుకుపోయింది. మురుగు కాల్వల నిర్మాణం లేదు.

బస్సు ఎక్కాలంటే బురద తొక్కాల్సిందే..!

చిన్నపాటి వర్షం వచ్చినా బాలాయపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ బురదమయం అవుతుంది. బస్సు ఎక్కాలంటే మోకాలి లోతు నీళ్లల్లో నడచి ఎక్కాల్సిందే. గూడూరు - వెంకటగిరి ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ఆర్టీసీ బస్టాండ్ దుస్థితి దారుణంగా ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి నిత్యం పనులపై జనం వస్తుంటారు. అయితే అడుసు తొక్కితేనే వీరు వారి ప్రాంతానికి వెళ్లగలరు.

అధికారులు పట్టించుకోరు : మైలారపు పెంచలయ్య, బాలాయపల్లి



ప్రజా సమస్యలను కోడి కూతంత దూరంలోనే అధికారులు ఉన్నా పట్టించుకోరు. చినుకు పడితే చాలు దోమలు స్వైరవిహారం చేస్తాయి. మరో పక్క బురద. అనేకమార్లు విన్నవించినా స్పందించే దిక్కులేదు. దళిత గిరిజనులంటే అధికారులకు, పాలకులకు చులకన. అందుకే మా సమస్యలను వారు పట్టించుకోరు.

వెంటనే చర్యలు తీసుకుంటా వినీల్‌కుమార్, ఎంపిడిఒ

గిరిజనవాడ ఇళ్లల్లోకి నీరు వస్తున్న సంఘటన నాకు తెలియదు. వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు చేపడతా. దళితవాడల్లో సిసి రోడ్ల నిర్మాణం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతా.



ఇళ్ల ముందు నిలిచి ఉన్న వర్షపునీరు



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బురద

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా కోశాధికారి బాలసుబ్రమణ్యం పిలుపు



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట పుల్లంపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం సిఐటియు మండల కమిటీ సమావేశం టి. నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కోశాధికారి బాలసుబ్రమణ్యం, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి మునిరాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ... డిసెంబర్ 11,12 తేదీల్లో తిరుపతి యశోదనగర్ లోని ఎంబి భవన్ వద్ద సిఐటియు జిల్లా మహాసభలు ఘనంగా జరుగుతాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని రేణిగుంట సిఐటియు మండల కమిటీ సమావేశం ద్వారా పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కమిటీ నాయకులు నరసింహారెడ్డి, రాజశేఖర్, వెంకట రమణ, లక్ష్మీ విజయ్ కుమార్, జయరాంరెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

30న బహిరంగ వాహనాల వేలం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఈ నెల 30న పుత్తూరు సెబ్ స్టేషన్లో బహిరంగంగా వాహనాలు వేలం జరుగుతుందని పుత్తూరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు డివిజన్ పరిధిలోని ఉన్న సెబ్ కార్యాలయంలో ఉన్న వాహనాలను ఈనెల 30వ తేదీన డివిజన్ పరిధిలోని సెబ్ స్టేషన్లో వాహనాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో పుత్తూరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయంలో ఉన్న 14 ద్విచక్ర వాహనాలను సెబ్ స్టేషన్లో బహిరంగంగా వేలం జరుగుతాయని సూచించారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

మధుకుమార్ సేవలు చిరస్మరణీయం


డాక్టర్ రవి రాజు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మధుకుమార్ సేవలు చిరస్మరణీయమని డాక్టర్ రవి రాజు పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయుడు మధుకుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం హాజరై డాక్టర్ రవి రాజు, పాత్రికేయులు, మిత్ర బృందం.. నివాళులర్పించారు. అనంతరం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ మధుకుమార్ సేవలు అభినందనీయమని. ఆయన పాత్రికేయ రంగంలో అనేక కథలు వివిధ రంగాల్లో కావలసిన కథనాలు, రచించేవారని, ప్రజల కోసం అనేక సేవలందించారని తెలిపారు. అలాగే న్యాయవాదిగా, కోర్టులో కూడా సేవలను అందించారు. ఈ సంతాప సభలో కోనేటి రవిరాజు, హరిబాబు, కౌన్సిలర్ నరసింహారావు, పాత్రికేయులు మిత్రులు పాల్గొన్నారు.

సైన్సు సైనికుల్లా పనిచేద్దాం

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సమాజంలోని అస్పృశ్యతలను, మూఢ నమ్మకాలను పారదోలి, ప్రజల్లో సైన్సు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు రాహుల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జన విజ్ఞాన వేదిక డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదిక రూపుదిద్దుకుందన్నారు. ప్రజల్లో తిష్టవేసిన మూఢ నమ్మకాలను, అపోహలను, తారతమ్యాలను అంతం మొందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని గుర్తు చేశారు. జన విజ్ఞాన వేదిక లక్ష్యాల కోసం ప్రతి కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక శ్రీకాళహస్తి డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి చెంచయ్య, ట్రెజరర్గా చిన్న గురవయ్య, ఉపాధ్యక్షులుగా మునిశేఖర్ రెడ్డి, ప్రవీణ్, సుబ్రమణ్యం, వెంకటేష్, రఘు, వెంకట కృష్ణయ్య, కార్యదర్శులుగా విజయ శేఖర్, నరేంద్ర, ప్రసాద్, రామకృష్ణయ్య, కమేష్, బాలాజీ, మణి, కార్యవర్గ సభ్యులుగా పార్థసారథి, వేణు, గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, రంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు నాగేశ్వరరావు, బుజ్జయ్య, పెంచలయ్య, రామలింగం, రాజేంద్రప్రసాద్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు చెంగయ్య, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు పుత్తూరు పట్టణంలోని స్థానిక కార్వేటినగర్ కూడలిలో హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ విభాగం ద్వారా స్టెప్ స్వచ్ఛంద సేవ సంస్థ, ఏపీఎస్ ఎసిఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్పై అవగాహన సాంస్కృతిక కళాబృందం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్పై వీధి నాటకం రూపంలో కళాబృందం ద్వారా, పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం రెడ్డప్ప, నాగేంద్రరావు, గంగమ్మ, గుర్రప్ప, స్టెప్ సెల్ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్ పంపిణీ



ప్రజాశక్తి - గూడూరు రూరల్: రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసేబుల్(రెడ్ సంస్థ) ఆధ్వర్యంలో కీ"శే" సనిశెట్టి వెంకట శ్రీధర్ జ్ఞాపకార్థం ఆది కుమారులు వంశీ కృష్ణ, సాయి కృష్ణ చైతన్య దాతృత్వంతో ట్రైసైకిల్, ఫల సరుకులను గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడివెద్ది శ్రీధర్, రాజ్ పురోహిత్ రాజేష్, రామలింగం, శ్రీనివాస ఆచారి, జమీర్ పాల్గొన్నారు.

'కర్ర సాము'ను కాపాడుకుందాం




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రాచీన విద్య కర్ర సామును కాపాడుకుందామని కర్ర సాము అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పొన్నాలమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం కర్ర సాము అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. కర్ర సాము విద్య అంతరించిపోకుండా యువకులను భాగస్వాములను చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అన్నారు. శ్రీనివాస్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు పనులకు శ్రీకారం

- మొదలుపెట్టిన ఆర్ అండ్ బి శాఖ అధికారులు
- 150 మంది ఆక్రమణదారులకు నోటీసులు జారీ
- రోడ్లు వెడల్పు చేయడంపై ప్రజల హర్షం

ప్రజాశక్తి-కోట : పట్టణంలోని కోట క్రాస్ రోడ్డు నుండి - తిమ్మానాయుడు పాళెం బైపాస్ రోడ్డు (కొత్తచెరువు) వరకు ఉన్న రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్లు గుంతలమయంగా ఉండటంతో ప్రజలు, వాహనదారులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఈ రోడ్లపై ఉదయం పూట అయితే గోతులు కనిపిస్తాయి కాబట్టి పడిలేస్తూ ఏదోలా వెళ్లగల్గుతున్నారు. రాత్రివేళ అయితే ఇందులో పడి ఆసుపత్రిపాలు కావడం ఖాయం. కోట పట్టణ రహదారుల పరిస్థితి మరి దారుణంగా ఉన్నాయి. అడుగడుగునా గోతులతో దర్శనమిస్తున్నాయి. చినుకు పడితే చాలు చెరువులను తలపిస్తున్నాయి.

కోట ప్రజలు, వాహన చోదకులు పడుతున్న కష్టాలకు ఫలితం కనపడుతుందనే చెప్పవచ్చు. ఈ గుంతలమైన రోడ్లు, ఆక్రమణలపై తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణ రెడ్డి, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్లు వెంటనే స్పందించారు. గూడూరు ఆర్డీవో ఒక్క అడుగు ముందుకు వేసి కోట రోడ్ల దుస్థితి స్వయంగా వచ్చి పరిశీలించారు. ఆ తరువాత ఆర్డీవో, కోట ఆర్ అండ్ బి శాఖ కార్యాలయానికి వెళ్లి డీఈ అరుణమ్మతో



అంతకుముందు గుంతలమయంతో రోడ్డు

చర్చించారు. కోట రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని వాటికి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఆర్డీవో డీఈని అడిగారు. ఇద్దరూ కొద్దిసేపు చర్చించారు. కోటలో శాశ్వతంగా సిమెంటు రోడ్లు నిర్మాణం జరగాలని, అందుకు ఇప్పటికే రూ.15 కోట్లతో ఎస్టిమేషన్లు సెక్రటేరియట్కు పంపడం జరిగిందని అందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఆర్డీవో కోరారు.

అంతేకాకుండా కోట పట్టణంలో ఆర్ అండ్ బి స్థలాలు ఆక్రమణ చేయడం, కోట ఆర్టీసీ అను బేకరి షాప్ నుండి లచ్చరెడ్డి బిల్డింగ్ వద్దనున్న పంట కాలువ వరకు ఉండే డ్రైనేజీ కాలువలు పూడ్చి వేయడంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి రావడంతో రోడ్లు ధ్వంసమవ్వడంతో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని చెబుతూ.. కోట పట్టణంలో ఆర్ అండ్ బి స్థలాల ఆక్రమణలపై సర్వే జరిగి మార్కింగ్ ఇచ్చి ఉన్నారని తెలిపారు. అక్కడ వరకు వ్యాపారస్తులు, ప్రజలు స్వచ్ఛంధగా ఆక్రమణలు తొలగించాలని ఆర్డీవో కోరారు.



ఆక్రమణలను తొలగించి ట్రాక్టర్ సాయంతో రోడ్డును వెడల్పు చేస్తున్న దృశ్యం

ఆక్రమణ దారులకు నోటీసులు

కోట పట్టణంలో ఆర్ అండ్ బి స్థలాలు ఆక్రమణ చేసిన 150 మందికి గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు కోట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు నోటీసులు జారీ చేశారు. రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యే లోపు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలని సంబంధిత అధికారులు కోరారు.

ఆర్డీవో ఆదేశాలు మేరకు కోటలో తాత్కాలిక పనులు మొదలు

కోట పట్టణంలో శాశ్వతంగా సిమెంట్ రోడ్లు మొదలుపెట్టే లోపు కోట పట్టణంలో ఉన్న గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అదేవిధంగా రోడ్లపై ఉన్న నీరు బయటకు పోయేలా రోడ్ల పక్క నున్న మట్టి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కిరణ్ కుమార్ ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెండు రోజులుగా కోట క్రాస్ రోడ్డు నుండి కొక్కుపాడు రోడ్డు వరకు పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే కొన్ని చోట్ల రోడ్లపై ఉన్న గుంతలను కాంక్రీట్ కంకర్తో పూడ్చి వేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న మట్టినితొలగిస్తున్నారు. దీంతో కోటకు మంచి రోజులు వచ్చినట్లు ప్రజలు భావిస్తున్నారు. కోట సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, గూడూరు ఆర్డీవో కిరణ్కుమార్లకు అభినందనలు తెలియజేస్తున్నారు.



రోడ్డుపై గుంతలు పూడ్చిన దృశ్యం

గ్యాస్ కనెక్షన్ ఉంటే ఉచిత బీమా

- లబ్ధిదారులను మోసంచేస్తున్న గ్యాస్ డీలర్లు
- 30 రోజులలోపు సమాచారం ఇవ్వాలి
- ప్రచారం లేక నష్టపోతున్న గ్రామీణ ప్రజలు

ప్రజాశక్తి -బాలాయపల్లి : మీకు గ్యాస్ కనెక్షన్ ఉంటే ప్రమాదశవత్తు ప్రమాదం జరిగితే ఉచితంగా రూ.50 లక్షల బీమా పొందవచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అవగాహన లేక అర్హులైన వారకి నష్టం జరుగుతుంది. గ్యాస్ కనెక్షన్ లేని ఇల్లు ఉండదు. ప్రతీ ఒక్క కుటుంబానికి ఎల్పిజి గ్యాస్ కనెక్షన్ ఉన్నప్పటికీ.. ఈ గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన విషయాలు వినియోగదారులకు తెలియవు. గ్యాస్ అయిపోయిందా... సిలిండర్ నింపిచ్చామా? వాడామా? అంత వరకే సగటు వినియోగదారులు ఆలోచిస్తారు.

ప్రమాద బీమా ఉందని తెలియదు:

గ్యాస్ సిలిండర్ ద్వారా ప్రమాదం జరిగితే ప్రమాద బీమా ఉంటుందన్న సంగతి చాలా మందికి తెలియదు. ఇక గ్యాస్ ఏజెన్సీలు సైతం ప్రమాద బీమాపై వినియోగదారులకు అవగాహన కల్పించరు. అందుకే గ్యాస్ కస్టమర్లు కచ్చితంగా ఈ బీమా సదుపాయాల గురించి తెలుసుకోవాలి. ఎల్.పి.జి గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వారికి రూ.50 లక్షల వరకు బీమా ఉంటుంది.

గ్యాస్ వాడేవారు తెలుసుకోవాలి ఇలా:

గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వెంటనే ఎల్.పి.జీ బీమా సదుపాయం చేయబడుతుంది. రూ.40 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. సిలిండర్ పేలుడు కారణంగా ప్రాణనష్టం సంభవిస్తే రూ. 50 లక్షల వరకు బీమా లభిస్తుంది. కుటుంబ సభ్యులు ఈ బీమాను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ క్రమంలో బీమా కోసం ఎలాంటి



అదనపు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు.

బీమాను ఎలా క్లెయిమ్ చేయాలి?:

గ్యాస్ సిలిండర్ ద్వారా ప్రమాదం జరిగి ప్రాణ, ఆస్తి నష్టం జరిగితే.. ఈ ప్రమాదం జరిగిన 30 రోజులలోపు వినియోగదారుడు అతడు వినియోగించే గ్యాస్ ఏజెన్సీకి, పోలీసు స్టేషన్కు ప్రమాదం గురించి ఫిర్యాదు చేయాలి. అదీ కాక ప్రమాదానికి సంబంధించి పోలీసుల నుంచి ఎఫ్ఐఆర్ కాపీని తీసుకోవాలి. దాంతో పాటు మెడికల్ రసీదు, ఆస్పత్రి బిల్లు, ప్రాణనష్టం జరిగితే పోస్ట్ మార్టం రిపోర్టు, మరణ ధృవీకరణ పత్రాలు అన్ని కలిపి సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్ద అందజేసి క్లెయిమ్ చేయించుకోవాలి.

రెగ్యూలర్గా సిలిండర్, స్టవ్ చెకప్ చేయించాలి:

బీమాకు అర్హులు కావాలంటే రెగ్యూలర్గా సిలిండర్, స్టవ్ చెకప్ చేయిస్తుండాలి. ఈ పాలసీలో ఎవరినీ మీరు నామినీగా చేయలేరు, ఎవరి పేరు మీద ఉంటే వారికే బీమా లభిస్తుంది. ఇక మీరు క్లెయిమ్ చేసిన ప్రమాదాన్ని మీ ఏజెన్సీ వారు ఏ కంపెనీ గ్యాస్ వాడుతున్నారో వారికి, బీమా కంపెనీలకు పంపిస్తారు. వివరాలకు మీ గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించాలి. ఈ క్రమంలోనే బిపిసిఎల్, హెచ్పిసిఎల్, ఇండియన్ ఆయిల్ కంపెనీల కారణంగా ప్రమాదం సంభవిస్తే.. మెత్తం ఖర్చును ఈ కంపెనీలే భరిస్తాయి.

పల్లెల్లో వారికి అవగాహన కల్పించాలి



గ్రామీణ ప్రాంతంలో ఉన్నవారికి గ్యాస్ సిలిండర్ వల్ల ప్రమాదం జరిగితే బీమా ఉందన్న సంగతే తెలియదు. గ్యాస్ ఏజెన్సీలు ద్వారా అవగాహన కల్పించాలి

- శ్రీలక్ష్మి అలిమిలి బాలాయపల్లి మండలం

ప్రమాద బీమాపై అవగాహన కల్పిస్తాం:




మండలంలో ఎన్ని గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయో వివరాలు సేకరించి గ్రామాల్లో గ్రామసభల ద్వారా గ్యాస్ సిలిండర్ పేలితే బీమా సౌఖ్యరంపై అవగాహన కల్పిస్తాం. **-అజ్మతుల్లఖాన్ తహశీల్దార్ బాలాయపల్లి**

వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి రథోత్సవం

ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం ఉదయం రథోత్సవం కన్నులపండుగగా జరిగింది. ఉదయం 7.10 గంటలకు రథోత్సవం మొదలై ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలుమంగ సకలదేవతా పరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో విహరించారు. రథోత్సవం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి రథమండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రథోత్సవంలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్స్వామి, చంద్రగిరి ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జేఈవో వీర బ్రహ్మం దంపతులు, సిఈ నాగేశ్వరరావు, విఎస్వోలు బాల్ రెడ్డి, మనోహర్, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఆర్జితం ఇన్స్పెక్టర్ దాము పాల్గొన్నారు.

శ్రీ పద్మావతీ అమ్మవారికి బంగారు పతకం కానుక

శ్రీ పద్మావతీ కార్తక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవలో అమ్మవారికి అలంకరించేందుకు బంగారు



పతకాన్ని కానుకగా అందజేశారు. తిరుపతికి చెందిన కస్తూరి బాయ్ ట్రస్ట్ ఛైర్మన్ పి.సి.రాయల్. సుమారు 117 గ్రాముల బంగారుతో తయారుచేసిన పతకం విలువ రూ.5.50లక్షలు విలువ చేస్తుంది. బంగారు పతకాన్ని సమర్పించిన భక్తుడికి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు బాబు స్వామి, స్వాగతం పలికి అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.



పంచమితీర్థంకు అన్ని ఏర్పాట్లు పూర్తిటిటిడి ఈవో ధర్మారెడ్డి

తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమితీర్థంకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. పంచమి తీర్థానికి వచ్చే భక్తులందరూ సమన్వయం పాటించి పుణ్య స్థానాలు ఆచరించాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి కోరారు. ఆదివారం ఉదయం తిరుచానూరులోని పంచమి తీర్థం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెఈఓ వీరబ్రహ్మం, టిటిడి ముఖ్య భద్రత అధికారి నరసింహ కిషోర్, జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

కల్కి అలంకారంలో అశ్వవాహనంపై అమ్మవారు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం రాత్రి అమ్మవారు కల్కి అలంకారంలో అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. ఆలయం నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభియమిచ్చింది.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరూ ద్విచక్ర వాహనదారులు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరు వద్ద ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో సత్యవేడు మండలం పెద్దఈటిపాకం గ్రామానికి చెందిన పీకే కృష్ణయ్య కుమారుడు మాజీ సర్పంచ్ జయశంకర్ రావు(40), అదే గ్రామానికి చెందిన విజయ్కుమార్ కుమారుడు గీతప్రియన్(7) అక్కడే మృతి చెందారు. ఈ రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఇందులో జయశంకర్ రావు కుమారుడు సంజయ్, విజయ్ కుమార్ సతీమణి వెన్నెల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసిన శ్రీసిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సూపర్ స్టార్ కృష్ణ మనసున్న మంచి మనిషి

- స్టేట్ వైడ్ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సినీ హీరో సూపర్స్టార్ కృష్ణ మనసున్న మంచి మనిషిని ఏపీ స్టేట్ సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమాన సంఘం స్టేట్ వైడ్ కన్వీనర్ ఎం. మధుసూదన్ రెడ్డి అన్నారు. తిరుపతి నగర సమీపంలోని మంగళం సర్కిల్లో అభిమాన సంఘం ఆధ్వర్యంలో దివంగత ఘట్టమనేని కృష్ణ దశదిన కర్మక్రియల నేపథ్యంలో ఆదివారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించి పెద్ద ఎత్తున వెయ్యి మంది పేదలకు అన్నదానం చేపట్టారు. తిరుపతి నగర అధ్యక్షుడు వెంకటేష్, గుండ్లపల్లి నాగరాజు, డాక్టర్ కరుణ, శేషారెడ్డి, అమర్నాథరెడ్డి, మహేష్,, నాగేందర్, మండి రాము, కొండలరావు,ముని, అభిమానులు పాల్గొన్నారు.

కోట: సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ ఇటీవలన మరణించడం అందరికి తెలిసిందే. ఈ మేరకు ఆదివారం కోట మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో కృష్ణ అభిమానులు ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు కోకర్ల మధు యాదవ్, మోపూరు. కృష్ణయ్య, మల్లి శ్రీనివాసులు, కృష్ణ అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాకాల: సూపర్ స్టార్ కృష్ణ సంస్మరణార్థం పాకాల మండలం వరదప్పనాయుడు పేటలో ఆదివారం అభిమాని చలం చలపతి రెడ్డి సుమారు 100 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా రంగానికి సూపర్ స్టార్ కృష్ణ లేనిలోటు తీర్చలేనిదన్నారు. రాజకీయ రంగంలో ఎదురు లేని నాయకుడిగా, సినీరంగంలో ఎవ్వరినైనా ఎదురించే నటుడిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా చరిత్ర సృష్టించారని కొనియాడారు.

ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: బోయబెంతో ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని యానాదుల సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా ఏపీ ఛైర్మన్ గురువారం చిరంజీవి పేర్కొన్నారు. యానాదుల సంక్షేమం సంఘం ముఖ్య నాయకులు పుత్తూరులో బోయబెంతో ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని విడుదల చేసిన జీవో నెంబర్ 52 ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడం ఖండన తెలియజేశారు. రిటైర్డ్ ఐఏఎస్ కమిషన్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలియజేస్తూ ఆందోళన చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 52 ను రద్దు చేయాలని కోరుతూ లేని పక్షంలో ఉద్యమం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. అజెండా వారిగా నిరసనలు గ్రామస్థాయిలో నుండి జిల్లా స్థాయి వరకు ఉంటుందని ఛైర్మన్ గురువారం చిరంజీవి అన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు ఎన్జీవో, ప్రజా ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసి భారీ ర్యాలీ జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని తెలిపారు. చిత్తూరు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రెండు రోజులు ఎస్టీ ప్రజలు మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నయ్య జయశంకర్, ఆదినారాయణ, శ్రీనివాసులు, సుబ్బరాజు, రాజశేఖర్, సరిత పాల్గొన్నారు

నిబంధన పక్కనబెట్టి..ప్రాణాలు కాపాడారు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆపదలో ఉన్నవారికి ఠక్కున గుర్తొచ్చేది 108. అయితే 108 నుంచి అధికారిక కాల్ వస్తేనే సాయం అందేది. అయితే ఆ నిబంధన పక్కనబెట్టి రోడ్డుప్రమాదంలో గాయపడ్డ యువకులకు సకాలంలో చికిత్స అందేలా చేసి ప్రాణాలు నిలిపారు శ్రీకాళహస్తి 108 సిబ్బంది. వివరాల్లోకి పోతే..108 పైలట్ హరీష్ రెడ్డి ఓ కేసు నిమిత్తం శ్రీకాళహస్తి నుంచి కేవీబీపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గంమధ్యలో రాజీవ్ నగర్ వద్ద తమ కళ్లెదుటే ఇద్దరు యువకులు కుక్కను తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడ్డారు. ఈ ఘటనలో నాగేంద్ర, చెందు అనే యువకులకు గాయాలయ్యాయి. వీరిలో చందు పరిస్థితి విషమంగా ఉండడంతో 108 పైలట్ హరీష్ రెడ్డి శ్రీకాళహస్తిలోని మరో 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో ఈఎంటి మానస పైలట్ భగవాన్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన చెందుకి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే 108 నుంచి అధికారిక కాల్ రాకున్నా ఆపదలో ఉన్న యువకులకు మానవతా దృక్పథంతో సాయం చేసిన 108 సిబ్బందిని క్షతగాత్రుల బంధువులే కాకుండా స్థానికులు అభినందించారు. కాగా నిబంధనలతో పని లేకుండా ఆపదలో ఉన్న వారికి సాయం చేసిన తమ సిబ్బందిని అభినందించాల్సిన ఓ అధికారి వారిని మందలించినట్లు తెలుస్తోంది. ఆపదలో ఉన్న వారిని కాపాడడమే 108 లక్ష్యమైనప్పుడు సిబ్బందిని మందలించడమేంటని జనాలు మండిపడుతున్నారు.

సంతాన సాఫల్యానికి చిరునామా..

'లావణ్య' ఫెర్టిలిటీ హాస్పిటల్

ప్రజాశక్తి-తిరుపతి సిటి: సంతానం పొందాలనుకునే దంపతులకు తీపికబురు. సంతాన సాఫల్యానికి చిరునామా, కలల సాకారానికి, పండింటి బిడ్డకు అమ్మలాంటి భరోసా 'లావణ్య' ఫెర్టిలిటీ అండ్ ఉమెన్ హెల్త్ సెంటర్(హాస్పిటల్) అని ప్రముఖ స్త్రీల వ్యాధుల వైద్య నిపుణులు, సంతానలేమి వారికి ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టరు టి.లావణ్య తెలిపారు. స్థానిక మారుతినగర్లోని శ్రీనివాసం కాంప్లెక్స్ వెనుక, బోత్ ఆసుపత్రి పక్కన, స్వర్ణ ఇఎన్టి ఆసుపత్రి ప్రాంగణంలోని లావణ్య ఫెర్టిలిటి హాస్పిటల్ వద్ద ఆమె 'ప్రజాశక్తి'తో మాటా డుతూ పిల్లలు లేరని దిగులు పడుతున్న దంపతులకు లావణ్య ఆసుపత్రి వైద్యుల సలహాలను పాటించి, మీ వారసత్వాన్ని నిలబెట్టుకోవాలన్నారు. రాయలసీమలోనే సంతానలేమి సమస్యలకు అతి తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తున్న ఏకైక హాస్పిటల్ లావణ్య ఫెర్టిలిటీ, స్త్రీల హాస్పిటల్ అన్నారు.





లావణ్య ఫెర్టిలిటీలో చికిత్స విధానం.

ప్రేరణతో అండోత్పత్తి : అడాశయం నుంచి అండాల తయారీ, విడుదలకు మందులు ఇవ్వబడుతాయి. అండం ఎదుగుదలను అల్ట్రాసౌండ్ ద్వారా పర్యవేక్షిస్తారు. తద్వారా స్త్రీ, పురుషుల కలయికను ప్రోత్సహిస్తారు. ఇది అతి తక్కువక ఖర్చుతో అతి తక్కువ సమయంలో సమర్థవంతంగా చేయగల చికిత్స.

గర్భాశయంలో శుక్రకణాలు ప్రవేశపెట్టడం ద్వారా గర్భధారణ(ఐయుఐ)

ఈ చికిత్స విదానం ఎక్కువగా పురుషుల సంతానలేమిలో అవలంభిస్తారు. ఇందులో మందుల ద్వారా అండోత్పత్తిని ప్రేరేపిస్తారు. ప్రోసెస్ చేయబడిన వీర్యాన్ని గర్భాశయంలోనికి క్యాతర్టెర్ ద్వారా పంపిస్తారు.

ల్యాప్రోస్కోపిక్, హిస్టెరోస్కోపిక్ సర్జరీ: గర్భాశయంలోని లోపాలను, గర్భాశయం లోని గడ్డలను, అండనాళాలలోని సమస్యలను ల్యాప్రోస్కోపిక్, హిస్టెరోస్కోపిక్ సర్జరీ ద్వారా సరిచేయవచ్చు.

పురుషులలో సంతానలేమి చికిత్సలు : మెడికల్ థెరపి, సర్జరీ ద్వారా స్పెర్మ్ రిట్రైవల్, వెరికోసెక్టమి వంటి శస్త్ర చికిత్సల ద్వారా వంధ్వత్వాన్ని నివారించవచ్చును.

ఫర్టిలిటీ ప్రిజర్వేషన్: ఎవరైతే గర్భదారణను వాయిదా వేయాలనుకుంటారో వారి శుక్రకణాలను, అండాలను కొన్ని సంవత్సరాల వరకు భద్రపరిచే సౌకర్యం కలదు.

టెస్ట్ ట్యూబ్ బేబీ: అండాశయం నుంచి అండాన్ని తీసుకుని శుక్ర కణాలతో కలిపి ఏర్పడిన పిండాన్ని గర్భాశయంలో ప్రవేశపెట్టడం. పురుషుల లైంగిక సమస్యలకు కూడా లావణ్య ఫెర్టిలిటి హాస్పిటల్లో చికిత్స అందిస్తామని తెలిపారు. లావణ్య ఫెర్టిలిటీ హాస్పిటల్లో సంతానలేమి సమస్యలకు, స్త్రీల వ్యాధులకు అధునాతన పద్ధతిలో నాణ్యమైన వైద్యాన్ని, అతి తక్కువ ఖర్చుతో అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని దంపతులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9441111645, 9398217014 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ఆసియా ఖండంలోనే ప్రతిభ చాటిన ఘనత

ధరణి అబాకస్ విద్యాసంస్థదే

స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆసియా ఖండంలోనే అతి చిన్న వయసులో విద్యార్థులు తమ ప్రతిభను చాటి చెప్పిన ఘనత ధరణి అబాకస్ విద్యాసంస్థదే అని స్విమ్స్ డైరెక్టర్, ఉపకులపతి డాక్టర్ వెంగమ్మ పేర్కొన్నారు. స్థానిక రిజర్వాయర్ కాలనీలోని ధరణి అబాకస్ సంస్థ సమావేశ మందిరంలో విద్యార్థులకు అభినందన సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ మాస్టర్ ఎస్. సమిత్ ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ వంటి టైటిలతో అతి చిన్న వయసులోనే ఎంత గొప్ప మేధావిగా ఎదగడం నిజంగా అద్భుతం అన్నారు. ధరణి అబాకస్ విద్యా సంస్థ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ పది సంవత్సరాలు పైగా విద్యార్థుల్లో ఉన్న జ్ఞాన సంపదను వెలికి తీయడంలో ధరణి అబాకస్ సంస్థ ఎంత కృషి చేస్తుందని



వెల్లడించారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఆన్లైన్, ఆఫ్ లైన్ విద్యార్థులకు బహుమతులను, అవార్డులను ప్రదానం చేశారు. తిరుపతి జెసి బాలాజీ, ఐఎఫ్ఎస్ యశోద భాయి, రవికుమార్, కిరణ్ కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్ల చికిత్సకు చిరునామా 'నవ్య'నేత్రాలయ

ప్రజాశక్తి-తిరుపతి సిటి: పరిసరాలను, ప్రపంచాన్ని చూసేందుకు అత్యంత అవసరమైనవి. కళ్లు సమస్యలను అశ్రద్ధ చేస్తే అంధత్వం వచ్చే అవకాశం ఉంది. కళ్ల వ్యాధుల చికిత్సకు సరైన చిరునామా 'నవ్య' నేత్రాలయమని నవ్యనేత్రాలయ ఆసుపత్రి అధినేత డాక్టరు యశ్వంత్రాజ్ తెలిపారు. స్థానిక మంచినీళ్లగుంట వద్దనున్న ఎల్ఐసి రోడ్డులోని నవ్యనేత్రాలయ ఐ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కళ్ల సమస్యలను అశ్రద్ధ చేయకూడదన్నారు. పలు కంటి సమస్యల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన తెలియజేశారు. కళ్లకు వచ్చే అలెర్జీని అధికమించేందుకు 8 మార్గాలు ఉన్నాయన్నారు. వాటిని పాటిస్తే కళ్లను సంరక్షించుకోవచ్చన్నారు.



అలెర్జీని అధిగమించేందుకు మార్గాలు

- పుప్పొడి అధికంగా ఉన్న సీజన్లో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండడండి.
- కిటికీలు మూసి ఉంచండి. కారులో, ఇంట్లో ఎయిర్ కండిషనింగ్ ఉపయోగించండి.
- ఊడవడం లేదా పొడి దుమ్ము దులపడానికి బదులుగా తడిగుడ్డతో లేదా తుడుపుకర్రతో నేలను శుభ్రం చేయండి.
- ఆరుబయట ఉన్నప్పుడు సన్ గ్లాసెస్తో మీ కళ్లను రక్షించుకోండి.
- దుమ్మువల్ల పురుగులు చేరకుండా ఉండడానికి పరుపులను తరుచుగా వేడి నీటితో ఉతకాలి.
- మీ చేతులను తరుచుగా శుభ్రంగా కడగాలి.
- మీ కళ్లు దురదుగా ఉంటే వాటిని రుద్దవద్దు. రుద్దడం వల్ల రోగ లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది.
- కళ్లలో ఏర్పడే అలెర్జీ కారకాలను తొలగించడానికి కన్నీరు తెప్పించే ప్రత్యామ్నాయాలు, కృత్రిమ కన్నీటి కంటి చుక్కలను ఉపయోగించడం.

నవ్య నేత్రాలయంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం కల్గిన అత్యాధునిక వైద్య పరికరాలతో కంటి సమస్యలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. దీన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.